## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:**

ఆర్థిక ఇబ్బందులతో ఓ భవననిర్మాణ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లో ఉంటున్న మేస్త్రీ పనిచేసే పునరం నాయక్ (35) ఉదయం తనగదిలో సీలింగ్‌రాడుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకునా ్నడని తెలిపారు. మృతుడు పునరం నాయక్ మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వార, దమహ్కాడ్, అంబమలికి చెందిన వాడు కాగా మేస్త్రీగా పని చేస్తున్నాడని, ఇంకా వివాహం కాలేదని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలే కారణంగా తెలుస్తోందని, మృతుని సోదరుడు బోడుప్పల్‌కు చెందిన గురుప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నర్సరీలో మొక్కలను నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

**తాండూరు, మార్చి 26, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ గౌతాపూర్ సర్పంచ్ రాజప్పగౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రెడ్డిలు అన్నారు. తాండూరు పీపుల్స్ డిగ్రీ కళా శాల ఎన్ఎస్ఎస్ వేసవి శిభిరంలో భాగంగా తాండూరు మండలం గౌతాపూర్‌లోని ప్రభుత్వ నర్సరీలో విద్యార్థులు సర్పంచ్ రాజప్పగౌడ్‌తో కలిసి మొక్కలను నాటడంతో పాటు నర్సరీలో పెరిగిన మొక్కలకు నీళ్ళు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సం రక్షించేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇం చార్జ్ మంజులబాయి, స్వాతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం

**బ్రహ్మోత్సవాల్లో ముగిసిన ప్రధాన ఘట్టం**

**కొనసాగిన కాడెద్దుల బండలాగుడు పోటీలు**



రథోత్సవంపై ఊరేగుతు భక్తులకు దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

**కొడంగల్,మార్చి 26ప్రభాతవార్త :**

తిరుమల తిరుపతి దేవస్థానం అనుసంధానంగా కొనసాగుతున్న శ్రీమహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి 43వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.ప్రతిరోజు ప్రత్యేక వాహనాలపై స్వామివారి దర్శనంతో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా పేరొందిన రథోత్సవాన్ని ఆదివారం ప్రత్యేక పూజలతో ఘనంగా నిర్వహించారు.రథోత్సవం సందర్భంగా ఉదయం వేళల్లో శ్రీనివాసుడు దేవస్థానం నుంచి వైభవంగా అలంకరించిన రథోత్సవంపై జాతర స్థలం వరకు ఊరేగింపుగా చేరుకొని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.సాయంత్రం వేళలో అశ్వవాహనం వీధి ఉత్సవంతో పురవీధుల్లో స్వామివారికి ఊరేగింపుగా తీసుకు వెళ్ళారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు బాలాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు భక్తులందరికి దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.రథోత్సవంలో మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారి పాటలను ఆలపించడం చోటు చేసుకుంది.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.రథోత్సవంలో కొడంగల్ పట్టణవాసులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింధ నామస్మరణతో మారుమ్రోగింది.

**ఆకట్టుకున్న కాడెద్దుల బండలాగుడు పోటీలు**

శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్శణగా నిలిచే కాడెద్దుల బండలాగుడు పోటీలు ఆనందోత్సవాల మధ్య కొనసాగాయి. జాతర స్థలంలో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు బాలాజీ,డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభుత్వ వైద్యులు రవీంద్రయాదవ్,రావులపల్లి సర్పంచ్ ఆర్.రమేష్‌రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ తదితరులు బండలాగుడు పోటీలను జెండా ఊపి ప్రారంబించగా కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల్లోని రైతులు తమ కాడెద్దులతో బండలాగుడు పోటీల్లో ఉత్సహంగా 42 జతల ఎద్దులు పాల్గొన్నాయి.ఉత్సహ భరితంగా సాగిన పోటీల్లో బొంరాస్‌పేట్ మండలం రేగడిమైలారం తండాకు చెందిన వెంకట్ నాయక్‌కు చెందిన కాడెద్దులు ప్రధమ బహుమతి సాధించగా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ చేతుల మీదుగా 25 తులాల వెండి కడియాలు అందజేశారు.అలాగే కొడంగల్ పట్టణానికి చెందిన దండ్ల వెంకటయ్య కాడెద్దులు ద్వితీయ బహుమతి సాధించంగా మున్సిపల్ చెర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి తరపున ఆయన సోదరుడు రావులపల్లి సర్పంచ్ రమేష్‌రెడ్డి 15 తులాల వెండి కడియాలు అందజేశారు.అలాగే కొడంగల్ పట్టణానికి చెందిన బొంబాయి కుర్మయ్య కాడెద్దులు తృతీయ బహుమతి సాధించగా మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ చేతుల మీదుగా 10 తులాల వెండి కడియాలు అందజేశారు.కాగా బండలాగుడు పోటీల్లో పాల్గొన్న కాడెద్దులు గాయపడితే చికిత్స అందించేందుకు గాను పశువైద్య శాఖ సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్,రత్నం,ప్రశాంత్‌లతో పాటు పోటీల నిర్వహకులు మురారీ వశిష్ట,రామకృష్ణారెడ్డి,గోపాల్, బాలప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**నందారం ఓంప్రకాష్ ఆధ్వర్యంలో అన్నదానం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త కొడంగల్ పట్టణానికి చెందిన నందారం ఓంప్రకాష్ అద్వర్యంలో జాతర స్థలంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.అలాగే సత్యసాయి సేవా సమితి ఆద్వర్యంలో జాతరకు తరలివచ్చే భక్తులకు ఎండలో ఉపశమనం పొందేందుకు గాను సేవా సమితి సభ్యులు దశరత్, శివశంకర్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు తదితరులు భక్తులకు చలివే ంద్రాన్ని ఏర్పాటు చేసి తాగునీటిని అందజేశారు.



జాతర స్థలంలో బండలాడుగు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న రవీంద్రయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నరసింహారావు

## సీపీఎం జనచైతన్యయాత్రను జయప్రదం చేయాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నరసింహారావు**

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** బిజెపి మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ నిర్వహిస్తున్న జనచైతన్యయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు డీజీ.నరసింహారావు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28 యాత్ర యాదాద్రి జిల్లా నుంచి మధ్యాహ్నం 3 గంటలకు అవుషాపూర్‌కు చురుకుంటుందని అక్కడి నుంచి ఘట్‌కేసర్ మీదుగా మేడిపల్లి, ఉప్పల్, చిలుకానగర్, నాచారం, మల్లాపూర్, మౌలాలి మీదుగా ఇసిఐఎల్‌కు వెళ్తుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఈడి, ఐటీలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్ప డుతుందని ఆయన ఆరోపించారు. ఈనెల 29న జనచైతన్యయాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో సీపీఎం కార్యదర్శివర్గసభ్యులు చింతల యాదయ్య, ఎ.అశోక్, జిల్లా సభ్యులు రాథోడ్ సంతోష్, ఘట్‌కేసర్ మండల కార్యదర్శి ఎన్.సబిత, నాయకురాలు నాగమణి, అరుణ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులను ప్రభుత్వమే పరిరక్షించాలి

**బాలల హక్కుల ప్రజాధ్వని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్**



విలేకరులతో మాట్లాడుతున్న కంచుకట్ల సుభాష్

**ఆమనగల్లు, మార్చి26, ప్రభాతవార్త:** బాలల హక్కులను కాపాడడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ, బాధ్యతను స్వీకరించాలని బాలల హక్కుల ప్రజా ధ్వని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుకట్ల సుభాష్ అన్నారు. రాష్ట్రంలో బాలల హక్కుల మీద యథేచ్ఛగా ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం హెచ్ఆర్‌సి, పిఏఆర్ఏ, పివిసిఆర్ ఆర్గనైజర్ కొమ్ము తిరుపతితో కలిసి కంచుకట్ల సుభాష్ విలేకరులతో మాట్లాడారు. ఈసంధర్బంగా ఆయన బాలల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసుతులు, కనీస అవసరాల కొరత ఏర్పడి బాలలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడి పోషకాలు అందడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును మార్చుకుని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూనపురి శ్రీశైలం, గొట్టిముక్కల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షులుగా జగన్మోహన్‌రెడ్డి



మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా బిఆర్ఎస్ పార్టీ లీగల్‌సెల్ కమిటీ నియామక పత్రాలు అందుకుంటున్న దృశ్యం

**కందుకూరు, మార్చి 26, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ లీగల్‌సెల్ కమిటీని ప్రకటించారు. అధివారం మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర విద్యాశాఖామాత్యులు పి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా కమిటీ ప్రతినిదులకు నియామక పత్రాలను అందించారు. కమిటీ అధ్యక్షులుగా కందుకూరు మండలం జైతారం గ్రామానికి చెందిన బైరు జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె అశోక్, అత్మకూర్ శ్రీనాద్, జనరల్ సెక్రెటరీగా ఇడమోని శివకుమార్, జాయిట్ సెక్రెటరీగా పి సంతోష్‌కుమార్, ట్రెజరర్‌గా కోటగిరి నలిని, కార్యవర్గ సభ్యులుగా ఎ ఉమా చంద్రశేఖర్, కె నవీన్‌రెడ్డి, ఎ పావని, గోల్కొండ మల్లేష్, కె యోగేష్ లను నియమిస్తు నియామక పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతు న్యాయవాద వృత్తిలో ఉన్న వారు సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కమిటీ మండల కమిటీతో సమన్వయంతో పనిచేస్తు ప్రజా సమస్యల పరిష్కారంలో ముదుండాలన్నారు. అదేవిదంగా ఈ కమిటీలు ప్రజలకు చేరువగా ఉంటు బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. ఈ సందర్బంగా నియోజకవర్గం అధ్యక్షులుగా ఎన్నికైన బైరు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతు రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు పి సబితాఇంద్రారెడ్డి తమపై నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం లీగల్‌సెల్ కమిటీ ప్రకటించి బాద్యతలను పెంచిదన్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తామని ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని మండల కమిటీలతో సమన్వయాన్ని కల్గిఉండి బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతామని త్వరలో మండల కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్బంగా మహేశ్వరం మండల బిఆర్ఎస్ పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షులుగా పి అశోక్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

## ప్రశ్నించే గొంతును నొక్కడం అప్రజాస్వామికం

**సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మిపండిత్**



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**తాండూరు, మార్చి 26, ప్రభాతవార్త :** ప్రశ్నించే గొంతు నొక్కాలని ప్రయత్నించడం అప్రజాస్వామికమని సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. సీపీఎం పార్టీ జనచైతన్య యాత్ర ఆదివారం వికారాబాద్‌కు చేరుకోవడంతో సీపీఐ జిల్లా కార్యదర్శి వియలక్ష్మిపండిత్ పాల్గొని యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నించే ప్రతిపక్షాలను, సామాజిక కార్యకర్తలను, పాత్రికేయులను గొంతు నొక్కాలని ప్రయత్నిస్తుందని, అబద్దపు కేసులతో, దాడులతో భయాందోళనకు గురిచేస్తుందని అన్నారు. ఉద్యోగాలు లేక, ఉపాధి కరువై, ఆదాయాలు తగ్గిపోయిన సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ, వారి బ్రతుకులు దుర్భరం చేసేవిధంగా పన్నులు పెంచడంతో పాటు గ్యాస్, నిత్యావసర ధరలు పెంచేసి ప్రజల రక్తాన్ని పిండుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోడి, అమిత్‌షాలు వారికి అత్యంత సన్నిహితులు, బినామీలైన ఆదాని, అంబానీలకు కమిషన్ల కోసం దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులందరూ మక్తకంఠంతో ఖండించాలని అన్నారు.

## ట్రస్మాను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుతాం

**-రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

**ఆమనగల్లు, మార్చి26, ప్రభాతవార్త:** తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అసోషియేషన్‌ను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. 20ఏళ్ళ క్రితం ఏర్పడిన అసోషియేషన్‌లో 32 జిల్లాల నుండి దాదాపు 9వేల బడ్జెట్ పాఠశాలలు సభ్యత్వం కల్గి ఉన్నాయని, కాలనుగుణంగా మార్పులు చేసుకుని బైలాస్ అమిండ్‌మెంట్ కమిటీ ద్వారా నూతన బైలాస్‌ను ఆమోదించుకుని భవిష్యత్తు కార్యాచరణతో ముందుకు సాగుతామని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని లక్ష్మి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ట్రస్మా అసోషియేషన్ ఆధర్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల ట్రస్మా సంఘాలు హాజరైనాయి. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి మధుసూధన్, కోశాధికారి రమణారావులు, రాష్ట్ర ప్రతినిధులు హాజరైనారు. రంగారెడ్డి జిల్లా ట్రస్మా అధ్యక్షుడు భీరప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రస్మా బైలాస్ అమిండ్‌మెంట్ కమిటీ పొందుపర్చిన నూతన బైలాస్‌పై సమావేశంలో సభ్యులు చర్చించి నూతన విధానాన్ని ఆమోదించుకున్నారు. అనంతరం వివిధ జిల్లాల ప్రతినిధులు ట్రస్మా బలోపేతానికి తీసుకోవలసిన చర్యలు, బడ్జెట్ పాఠశాలలు ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించి కార్యచరణను రూపొందించుకున్నారు. ప్రభుత్వ పరంగా ట్రస్మా సాధించవలసిన హక్కులను సాధించుకోవడానికి ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడానికి కృషి చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావలసిన పలువురు సభ్యులు కోరారు. రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలలు చేస్తున్న సేవలను కొనియాడారు. కరోన మూలంగా విధించిన లాక్‌డౌన్ కాలంగా రాష్ట్రంలో అనేక పాఠశాలలు మూతపడి పోయాయని, మరి కొన్ని మనుగడ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలల మనుగడ సాధించుకోవడానికి ట్రస్మా బైలాస్‌లో మార్పుల చేర్పుల డిమాండ్ ఏర్పండిదని, దానికి అనుగుణంగా సమావేశంలో ఆమోదించుకుంటున్నామని యాదగిరిశేఖర్‌రావు తెలిపారు. నూతన బైలాస్‌లో అనేక అంశాలు చేర్చామని, అవి ట్రస్మా బలోపేతానికి మద్దతుగా నిలుస్తాయని శేఖర్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోవు రోజులలో ట్రస్మాను మరింత బలోపేతం చేసేందుకు సభ్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పరంజ్యోతి, నారాయణరెడ్డి, ఉమామహేశ్వర్, బీరప్ప, జోసఫ్, చుక్క అల్లాజిగౌడ్, తల్లోజు వెంకటయ్య, సువర్ణగోవర్ధన్‌రెడ్డి, అవ్వారి నిరంజన్, యు.శ్రీనివాసులు, గోలి శ్రీనివాసులు, అవ్వారి శివలింగం, కొట్ల వెంకటేష్, ఆమనగంటి సంజీవ్‌కుమార్, మహుముద్, లక్ష్మయ్య, తిరుపతయ్య, లక్ష్మణ్, ఆంజనేయులు, శ్రీరామ్, శ్రీనివాస్, సత్తిరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు, లారీ ఢీ : పరువురికి గాయాలు

**కొత్తూర్, మార్చి 26, ప్రభాతవార్త :**

ఆర్టీసీ బస్సు లారీ ఢీకొనడంతో సుమారు 15మందికి తీవ్ర గాయాలు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...100 డయల్ నెంబర్ ద్వారా సమాచారం అందిన పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. శనివారం అర్థరాత్రి సుమారు 12గంటల సమయంలో నేషనల్ హైవేపై తిమ్మాపూర్‌కు దగ్గర్‌లోని దుని పాలిమర్స్ కంపెనీ ఎదురుగా సీఎంటీఎల్ నుండి స్టీల్ లోడుతో వెళ్తున్నటువంటి కంటైనర్‌ను, వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న కంటైనర్ లారీని వెనుక నుండి ఆర్టీసీ బస్సు ఢీకొనగా ఆర్టీసీ బస్ డ్రైవర్, కండక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్ లోడుతో వెళ్తున్నటువంటి కంటైనర్ లారీకి ఎలాంటి ప్రమాద సూచికలు, రేడియం స్టిక్కర్ లేకుండా అజాగ్రత్తగా వెళ్లడంతో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో లారీని సరిగ్గా గమనించక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు దాదాపు 15మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయన్నారు. వీరందరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా ఉస్మానియా ఆసుపత్రికు తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన బస్సు

## కాంగ్రెస్ నిరసన దీక్షకు తరలిన శ్రేణులు



నిరసనదీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మార్చి 26, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ ఎంపిగా అనర్హులని గుర్తిస్తూ కేంద్రం నిర్ణయించటాన్ని వ్యతిరేకిస్తూ టిపిసిసి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ నిరసన దీక్షా కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి పాల్గొన్నారు. ఆదివారం టిపిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నుంచి జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన సత్యాగ్రహ దీక్షలో పలువురు పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసిసి అధ్యక్షులు నందికంటి శ్రీధర్‌తో పాటు మేడ్చల్ నియోజకవర్గం కోఆర్డినేటర్లు టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా పలువురు నాయకులు, జిల్లా నాయకులు వై.నాగేశ్వర్‌గౌడ్, ఎం.మహేందర్‌యాదవ్, మండల అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, నర్సింలుయాదవ్, బి.జైపాల్‌రెడ్డి, నాయకులు ఆనంద్, శ్రీనివాస్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్

## సిఎం సహాయనిధి పేదలకు వరం : శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి మార్చి26,ప్రభాతవార్త :** పేదలకు సిఎం సహాయనిధి వరంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను బురమోని బాలమణి 56వేల రూపాయలు ,ఆయిల్ రాణిలకు 18వేల రూపాయలను శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నరేందర్ గౌడ్,గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, నాయకులు రాజేందర్ రెడ్డి,శేఖర్ గౌడ్,అంజి,పర్వతాలు యాదవ్, రాజు,మహేందర్,రాజు,రవి,తదితరులు పాల్గొన్నారు.

**చౌదర్‌పల్లిలో :** మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీశైలంకి మంజూరైన 27వేల రూపాయల సిఎం సహాయనిధి చెక్కును శ్రీనివాస్ యాదవ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు బాల కుమార్ గౌడ్,శ్రీధర్ రెడ్డి,శ్రీను,శేఖర్‌గౌడ్,గిరి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి మార్చి26,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన బండగల నరసింహ అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్పందించి వెంటనే ఐక్యత సభ్యులతో 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో పెరుమండ్ల రమేష్,పొటిగంటి రమేష్,మీసాల శ్రీనివాస్,లకుమల్ల ప్రశాంత్, బోళ్ల యాదగిరి,పుట్ట నాగరాజు,శివరాజ్,పెరుమల్ల రాములు, ఐక్యత సభ్యులు బలగం నరేందర్ గౌడ్,నూనె రాఘవేందర్, పోతుగంటి విజయ్,బలగం శివ,భరత్ రెడ్డి,మల్లేష్,కొప్పు యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**-గుజ్జుల మహేష్**


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల మహేష్

**తలకొండపల్లి మార్చి26,ప్రభాతవార్త :** వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరేస్తామని పలువురు కాంగ్రెస్ నాయకులు గుజ్జుల మహేష్ పేర్కొన్నారు.ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో హాత్ సే హాత్ సే జోడో కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు అనిల్ గౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంబు ఇస్తారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి గడపగడపకు కరపత్రాల పంపిణి చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు.అనంతరం ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో లో నాయకులు మాట్లాడుతూ....కేంద్ర,ప్రభుత్వాలు కేవలం కమిషన్‌లు దండుకునే పథకాలు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని దేశాన్ని అప్పుల మయం చేసి దోచుకుంటున్నారని విమర్శించారు.వెంకటాపూర్ గ్రామంలో ఒక్కటంటే ఒక్కటి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ,దళిత బంధు, దళితులకి మూడెకరాల భూమి,రాలేదని దుయ్యబట్టారు. కేవలం వాటిని ఎరగా చూయించి ఓట్లు దండుకునే కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రీకారం చుట్టిందని విమర్శించారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఘనమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు.ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల భారీ సానుకూలత వ్యక్తం అవుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుదుముల చంద్రకాంత్ రెడ్డి,రంగారెడ్డి,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్ గౌడ్,బ్లాక్ బిసి సెల్ అధ్యక్షుడు గోపాల్,కల్వకుర్తి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిస బాలరాజు,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జంగయ్య గౌడ్,మండల సేవాదళ్ కార్యదర్శి సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి,నరేష్ ముదిరాజ్‌పాల్గొన్నారు.

## విశ్వకర్మ సంఘం అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయం

**విశ్వకర్మ సంఘం ప్రతినిధి గద్దె శ్రీనివాస్‌చారీ**

**పెద్దేముల్, మార్చి 26, ప్రభాతవార్త:** విశ్వకర్మ సంఘం అభివృద్ధికి తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని విశ్వకర్మ సంఘం ప్రతినిధి గద్దె శ్రీనివాస్‌చారీ అన్నారు. పెద్దేముల్ మండలం కందనెల్లి శివారులోని విశ్వకర్మ గుట్టపై వంటశాల నిర్మాణానికి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రూ. 5 లక్షల నిధులు మంజూరు చేశారు. విశ్వకర్మ గుట్టపై షెడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్‌తో, సంఘ సభ్యులతో ఎస్టిమేషన్ వేయడానికి ఆదివారం చర్చించారు. ఈ సందర్భంగా గద్దె శ్రీనివాస్‌చారీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కృషిచేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తున్న ఏకైక వ్యక్తి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం ప్రతినిధులు యం.శ్రీనివాస్‌చారి, తాండూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి,ఎల్ఐసి తాండూరు(ఎస్ట) అధ్యక్షులు వడ్ల శ్రీనివాస్,బాలు చారి, పరమేశ్వర్ చారి, రంగచారి, మాజీ సర్పంచ్ రవి చారి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థికి రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతి


విద్యార్థి శివప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

**కొడంగల్,మార్చి 26ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థి సి.శివప్రసాద్‌కు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శంకర్‌బాబు తెలిపారు.ఈనెల 25న ఆగాఖాన్ అకాడమీ హైద్రాబాద్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్య ప్రస్థానం పోటీల్లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి సి.శివప్రసాద్ ద్వితీయ బహుమతి సాధించారు.ఆగాఖాన్ తెలుగు శాఖ అధ్వర్యంలో శతన,భగవత పద్యాల పోటీల్లో రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన శివప్రసాద్‌ను బీసీ గురుకులాల సెక్రటరీ మల్లయ్య బట్టు,ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేషం,ఆర్‌సీఓ యాదయ్యగౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు.


ఈ-శ్రమ్ నమోదును ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ సత్యనారాయణగౌడ్

## ఈ-శ్రమ్, ఆయుష్మాన్‌భారత్ నమోదు ప్రారంభం

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో ఆదివారం ఈ-శ్రమ్, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదును చేపట్టారు. స్థానిక ఉపసర్పంచ్ కట్ట సత్యనారాయణగౌడ్ విచ్చేసి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకటాపూర్, తేనుగూడెం, వైభవ్‌కాలనీలో వైఎస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నమోదుకు సంబంధించి ఉచితంగా నమోదు, కార్డుల లామినేషన్, సర్వీస్ చార్జ్‌లను సమకూర్చుతున్నారు. ఈసందర్భంగా వైఎస్ రెడ్డి ట్రస్టు చైర్మన్, ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైఎస్ రెడ్డి ట్రస్టు సభ్యులు వినోద్, నవీన్, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల రాజ్యాధికారంతోనే అంబేద్కర్‌కు నివాళి


రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేస్తున్న అరుణ్‌కుమార్, జంగయ్య, దయానంద్ తదితరులు

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 102వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిఎస్‌పీ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు చీర్యాల జంగయ్య, ఇంచార్జ్ సుక్క దయానంద్, కార్యదర్శి ఎర్ర కృష్ణులు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేశారు. ఎస్‌సీ, ఎస్‌టీ, మైనారిటీలు బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అంబేద్కర్ మహద్ సత్యాగ్రహం చేసి 96 సంవత్సరాలు గడుస్తుందని అరుణ్‌కుమార్ సత్యాగ్రహంపై తెలియజేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం కార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు తోక బాలయ్య, జియపల్లి భద్రి, నారాయణ, సత్యం, అంజయ్య, మల్లేశ్, శ్రీరామ్, ఆనంద్, వెంకటేశ్వరావు, సురేశ్, సచిన్. ఉపేందర్, శంకర్, భరత్, మహేశ్, కృష్ణంరాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

**వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసగుప్తా**


యువతతో మాట్లాడుతున్న ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**తాండూరు, మార్చి 26, ప్రభాతవార్త :** రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం తాండూరుకు వచ్చిన శ్రీనివాస్‌గుప్తా వైశ్య ఫెడరేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రొంపల్లి సంతోష్‌కుమార్ నివాసంలో యువతతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్తాను ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షులు రొంపల్లి సంతోష్‌కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిదంగా సంతోష్‌కుమార్ ఫార్మా లాండ్‌తో పాటు డ్రైవ్ ఇన్ఫినిట్‌ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


మున్సి పాల్టీ పరిధిలో జరిగిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులను అందజేసిన గుండ్లపోచంపల్లి మున్సి పాల్టీ వైస్‌చైర్మన్ డి.ప్రభాకర్

**మేడ్చల్, మార్చి 26, ప్రభాతవార్త**

గుండ్లపోచంపల్లి మున్సి పాల్టీ పరిదిలో వైస్‌చైర్మన్ డి.ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరిగాయి. ఆదివారం మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లి మున్సి పాల్టీ పరిదిలో జరిగిన క్రికెట్ పోటీల్లో 6టీమ్‌లు పాల్గొన్నాయి. విన్నర్స్ టీమ్‌గా కండ్లకోయ లూజర్ టీమ్ సంజన ప్రాంగణం, బహుమతి విజేతలు 5వేల రూపాయలు లూజర్ జట్టు, 2వేల రూపాయలు బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డు హరిచంద్ర, బెస్ట్ బౌలర్ అవార్డు నరేంద్ర అందుకున్నారు. విన్నర్ టీమ్‌కు ట్రోఫీకప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పిఎసిఎస్ వైస్‌చైర్మన్ డి.నరహరి, సీనియర్ బి.కృష్ణారెడ్డి, కె.శశిధర్‌రెడ్డి, 10వవార్డు అధ్యక్షులు కె.హరికృష్ణ, సీనియర్ వై.రాజేందర్, మున్సిపల్ వైస్ ప్రసిడెంట్ కె.ప్రవీణ్, డి.సందీప్, వై.సిద్ధు, వీరేష్, ఆర్గనైజర్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ బోనాల పండుగ

**షాబాద్, మార్చి 26, ప్రభాతవార్త :**

షాబాద్ మండలంలోని ఎర్రోనిగూడ గ్రామంలో మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలో బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. శివసత్తుల పూనకాలతో, పోతురాజుల విన్యాసాలతో, యువకుల కేరింతలతో ఘనంగా బోనాలు, తొట్టేల ఊరేగింపు జరిగింది. గ్రామస్థులంతా మైసమ్మ తల్లిని ఊరువాడ జల్లగా చూడు తల్లి, వర్షాలు కురిపించి ప్రజలను సుఖసంతోషాలతో ఉండే విధంగా చూడు తల్లి అంటూ కోరుతూ తమ బోనాల నైవేద్యాన్ని మైసమ్మ తల్లికి సమర్పించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి, గ్రామస్థులు మల్లారెడ్డి, నర్సింహ్మారెడ్డి, మాధవరెడ్డి, జైపాల్‌రెడ్డి, రఘురాంరెడ్డి, యాదగిరి, గురుస్వామి తదితరులు ఉన్నారు.

## ప్రతిభ కనబరిచి కుంగ్ ఫూ విద్యార్థులు

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 26,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదనిగూడ మండలంలోని రావిర్యాల గ్రామానికి చెందిన కుంగ్ ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. షాద్‌నగర్ పట్టణంలోని గణేష్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ పోటీల్లో ఎదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 18మందంది విద్యార్థులు మొదటి, ద్వితీయ, తృతీయ విభాగాల్లో నిలిచినట్లు మాస్టర్ రాజు తెలిపారు. విద్యార్థులకు మాస్టర్ రమేష్, మాస్టర్ బాల్‌రాజుల చేతుల మీదుగా మేమోంటులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


ఎంపిఎల్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

## క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు: ఎంపిపి

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** యువత సమయం వృధా చేసయకుండా క్రీడలపై దృష్టిసారిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం మాదారంలో ఆదివారం మాదారం ప్రీమియం లీగ్ 4 (ఎంపిఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆయన టాస్ వేసి ప్రారంభించారు. వైఎస్ రెడ్డి ట్రస్టు ద్వారా గ్రామాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. యువకులు సెల్‌పోన్లు వినియోగిస్తు సమయం వృధా చేసుకోకుండా ఖాళీ సమయాల్లో క్రీడలు ఆడాలని ఆయన సూచించారు. క్రీడల ద్వారా శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం కల్గుతుందని క్రీడాకారులు ఉత్సాహంగా ఎంపిఎల్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నిర్వహకులు ప్రభాకర్, కృష్ణసాయి, సంతోష్, దయాకర్, ఉపేందర్, నరేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా పాదపూజ


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

**ఆమనగల్లు, మార్చి26, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదపూజ అత్యంత వైభవంగా కన్నుల పండువగా సాగింది. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆచార్య రమేశ్‌గురూజీ పర్యవేక్షణలో నిర్వహించిన పాదపూజలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాలు కడిగి వందనం సమర్పించుకున్నారు. అంతకు ముందుకు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాదపూజతో ఫంక్షన్ హాలులో సందడి నెలకొన్నది. పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైనారు. ఈమేరకు సహజ ఆనందయోగ గురువు రమేశ్‌గురూజీ యోగాసనాలు వేయించి ఆరోగ్య సూత్రాలు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ జోనల్ ఇంచార్జీ శేఖర్‌రెడ్డి, యాజమాన్యం బి. శ్రీనివాస్, జూలూరి రవింద్రానంద్, వనం సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్, శంకర్, రామాచారి, విఠల్‌గౌడ్, హాజరైనారు.

## లైన్స్ జిల్లా ఉపగవర్నర్‌గా డా జి మహేంద్రకుమార్‌రెడ్డి

**కందుకూరు, మార్చి 26, ప్రభాతవార్త:** లయన్స్ జిల్లా 320 ఎ రెండవ ఉప గవర్నర్‌గా డా జి మహేంద్రకుమార్‌రెడ్డిని నియమిస్తు జిల్లా కార్యవర్గం ప్రతినిదులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉపగరవర్నర్‌గా ఎంపికైన డా జి మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతు లైనిజంద్వారా ప్రజలకు సేవచేయడం అనందంగా ఉందన్నారు. అసేవలకు గుర్తింపుగా ఈ పదవి రావడం బాద్యతలను పెంచిందన్నారు. లైనిజానికి పరిచయం చేసిన వారికి ప్రత్యేక అబినందనలు తెలియ జేశారు. ఈ సందర్బంగా తనకు వెన్నంటి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కందుకూరు లైన్స్‌క్లబ్ అధ్యక్షులు బిఆర్ రాంరెడ్డి, లైన్ అంజయ్య, లైన్ గంట రాంరెడ్డి, లైన్ జగదీశ్వర్‌రెడ్డి, లైన్ చెన్నకిషన్‌రెడ్డి, జి అమరేందర్‌రెడ్డి, లైన్ సత్యానారాయణరెడ్డి, లైన్ కొండల్‌రెడ్డి, లైన్ కేశవరెడ్డి, లైన్ రాంగోపాల్‌రెడ్డి, లైన్ రంగారెడ్డి, లైన్ క్రిష్ణరాంభూపాల్‌రెడ్డి, లైన్ డా సుగునాకర్‌రెడ్డి, లైన్ విఠల్‌రెడ్డి, లైనన అంజిరెడ్డి, లైన్ వెంకటేష్‌గుప్త, లైన్ రాంబాబు, లైన్ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న వర్రీ తులసిరామ్ విజయ్‌కుమార్

**శంకర్‌పల్లి, మార్చి 26, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షమ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు గడపగడపకు వెళ్లి వివరించాలని చేవెళ్ల నియోజకవర్గం నాయకులు వర్రీ తులసిరామ్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని ఆలాంఖాన్‌గూడ, ఎర్వగూడ గ్రామాల్లో శంకర్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షులు బసగళ్ల రాములుగౌడ్, మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎల్.ప్రభాకర్‌రెడ్డి, ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి కార్యకర్తలు వివరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో పాటు వివిధ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రానురాను భారతీయ జనతా పార్టీకి గ్రామాల్లో ఆధరణ పెరుగుతుందని అందుకోసం కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నరసింహముదిరాజ్,ప్రభాకర్, శివకుమార్, మనీష్, కుమార్‌గౌడ్, కృష్ణారెడ్డి, శ్రీశైలం, శ్రీకాంత్‌యాదవ్, సాయికుమార్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఆయా గ్రామాల బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

## గోపులారంను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

**శంకర్‌పల్లి, మార్చి 26, ప్రభాతవార్త :** గోపులారం గ్రామాన్ని జిల్లాలోని ఆదర్శ గ్రామంగా కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లి మండలం గోపులారం గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.... గ్రామంలోని ప్రతి కాలనీలో సిమెంట్ రోడ్లు మురుగు కాల్వల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహకారంతో గ్రామంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు.మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు శివలీల శ్రీనివాస్, రమేష్, సురేందర్, వెంకట్‌రెడ్డి, సరితసత్యనారాయణ, శారధరాంచెందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి : సిఐ అప్పయ్య

**ధారూరు, మార్చి 26, ప్రభాతవార్త:** హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ధారూరు సిఐ అప్పయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటవ తేదీ ఎండి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదివరకు జరిగిన రోడ్డు ప్రమాదాల కేసులలో చనిపోయిన వారిలో తలకు గాయాలయి చనిపోయిన సందర్భాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు.

## రేపు సహకార సంఘం సర్వసభ్య సమావేశం

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** ఈనెల 28న ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎండి.ఎం.కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలోని నారాయణ గార్డెన్స్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన అర్థ సంవత్సర మహాజనసభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డిలతో పాటు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు, రైతులు సకాలంలో విచ్చేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎండి కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** కొండాపూర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని ఫీడర్ మరమ్మత్తుల కారణంగా సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అ ంతరాయ ం కల్గుతుందని ఘట్‌కేసర్ ఏఇ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్ 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని 11 అవుషాపూర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేస్తున్నందున సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవుషాపూర్, ఎస్‌పిఆర్ స్కూల్, ఆరోరా కళాశాల, అనురాగ్ కళాశాల, కేపాల్‌లో విద్యుత్ సరఫరా ఐదు గంటల పాటు ఉండదని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఇ కోరారు.

## గుబ్బరిగుట్ట మైసమ్మ ఆలయానికి విరాళం


మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న సందీప్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడకు చెందిన బీఆర్ఎస్‌పార్టీ మండల ఉపాధ్యక్షులు పాలడుగు సందీప్‌రెడ్డి గుబ్బరిగుట్ట మైసమ్మ అమ్మవారి ఆలయా నికి రూ.30,000లు విరాళం ఇచ్చారు. ఘట్‌కేసర్ మండలం సాదత్ ఆలీగూడ-ప్రతాపసింగారం మధ్య ఉన్న గుబ్బరిగుట్టపై మైసమ్మ దేవాలయాన్ని జీర్ణోద్దరణ చేసి పునర్నిర్మాణం చేశారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం అభివృద్ధి చేయగా సందీప్‌రెడ్డి అమ్మవారి దేవాలయానికి తన వంతు విరాళంగా రూ.30 వేలు సుధీర్‌రెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

## ఘనంగా వికెహెచ్ఎస్ వార్షికోత్సవ వేడుకలు


శివారెడ్డిగూడ విద్యాకిరణ్‌లో సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**ఘట్‌కేసర్, మార్చి 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని విద్యాకిరణ్ హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ అంశాలలో విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేశభక్తి, సంస్కృతి సాంప్రదాయాలు, భరతనాట్యం తదితర ప్రదర్శనలు అలరించారు. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్ పుష్పలత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని విద్యలో రాణించడం ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధిస్తారని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలలో రాణించాలని ఆమె సూచించారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కరస్పాండెంట్ రమేశ్, ఉపాధ్యాయులు నవీన్, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో పలు గ్రామాలకు కరెంట్ అంతరాయం

**మండల ఏఈ బనోత్తు ఆము**

**మొయినాబాద్, మార్చ్ 26 , ప్రభాతవార్త :** నేడు మండలంలోని పలు గ్రామాలకు కరెంట్ అంతరాయం కలుగనున్నట్లు మండల ఏఈ బానోతు ఆము అన్నారు, ఆదివారం ఆయన వార్త పత్రికతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు మండలంలోని కొన్ని గ్రామాల్లో తోల్కట్ట, సజన్‌పల్లి, కేత్తిరెడ్డిపల్లి , నక్కలపల్లి, ఎత్బార్‌పల్లి, గ్రామాలకు కరెంట్ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు, మండలంలోని కేత్తిరెడ్డి పల్లి గ్రామ రెవెన్యూలోగల సబ్‌స్టేషన్ మేంటనేన్స్ నిర్వాహన పనులు జరగనున్నట్లు తెలిపారు, 33/11 కె.వి సంవత్సరానికి ఒక్కరోజు నిర్వహణ ఉంటుందని తెలిపారు, సోమవారం మేంటనేన్స్ కోసం ఒక్కరోజు కేత్తిరెడ్డిపల్లి గ్రామం నుండి డైరెక్టుగా కనెక్షన్ ఉన్న గ్రామాలు సజన్‌పల్లి, కేత్తిరెడ్డిపల్లి, ఎత్బార్‌పల్లి, గ్రామాలకు కరెంట్ ఉదయం నుండి మధ్యాహ్నం 2: 30 నిమిషాల వరకు మేంటెనేన్స్ పనులు జరుగుతాయని ఆ గ్రామాల కు కరెంట్ ఉండదని ఆ గ్రామాల ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన కోరారు, అకాల వర్షాలకు ప్రజలకు ఎలాంటి కరెంట్ సమస్యలు రాకుండా ముందస్తుగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు, కరెంట్ లేదని ఆయా గ్రామాల ప్రజలు ఫోన్‌లు చేయకుండా సహనం వహించాలని అన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**షాబాద్, మార్చి 26, ప్రభాతవార్త :**

షాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-23 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని ఓ రిసార్ట్స్‌లో 100మంది పూర్వ విద్యార్థులు కలుసుకుని తీపిజ్ఞాపకాలు పంచుకున్నారు. 20ఏళ్ల తర్వాత చిన్న తనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికి మరిచిపోనిది, విడదీయరానిదని గుర్తు చేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినవారు ఒక్క చోటికి రావడం ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈరోజు ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు సందడిగా గడిపారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేష్, అనిల్‌గుప్తా, కుమ్మరి రాజేందర్, శ్రీనివాస్, వీరేష్‌గుప్తా, శ్రవణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**షాబాద్, మార్చి 26, ప్రభాతవార్త :**

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలని కుర్వగూడ సర్పంచ్ బుయ్యని సంధ్యారాణిమల్లిఖార్జున్‌గౌడ్ తెలిపారు. ఆదివారం కుర్వగూడలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి దేవాలయానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు దేవాలయం నిర్మిస్తున్నామన్నారు. దేవాలయం నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.ఎంపీటీసీ వనితవెంకటేష్, గ్రామస్థులు ఉన్నారు.



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## అన్నదాతలకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం

**ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

**సిర్గాపూర్, మార్చి 26 ప్రభాతవార్త:** అన్నదాతలకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిర్గాపూర్ మండలం బోక్కస్‌గామ్ గ్రామంలోగల ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో శెనిగేల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎన్నడు లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అధ్యక్షురాలు మాధవరావు పాటిల్,పీఎసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రాములు, ఖేడ్ మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, నాయకులు జ్ఞానేశ్వర్, తదితర గ్రామాల ప్రజలు, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కుస్తీ పోటీలు



హన్మంతరావుపేటలో కుస్టీ పోటీల్లో పాల్గొన్న మల్లయోదులు

**నారాయణఖేడ్, మార్చి 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని హన్మంత రావుపేటలో జాతర ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులుగా కుస్తీ పోటీలు కొనసాగాయి. సర్పంచ్ దత్తు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ కుస్తీ పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి మల్లయోదులు కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా ఐదు తులాల వెండి కడియం మహరాష్ట్రాకు చెందిన పహిల్వాన్ కైవసం చేసుకున్నాడు. కాగా గ్రామంలో వారం రోజుల నుంచి నాటకం ప్రదర్శన కొనసాగాయి. వారం రోజుల నుంచి జనాలు తరలిరావడంతో గ్రామం మొత్తం జనంతో నిండిపోయింది. అనంతరం జాతర చివరి రోజు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో బండి సంజయ్‌కు సన్మానం



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న బిజెపి కౌన్సిలర్ రాజేశ్వరి మాణిక్‌రావు

**సదాశివపేట, మార్చి 26, ప్రభాతవార్త:** కర్ణాటకలోని బసవకళ్యాణ్‌లో ఆదివారం జరిగిన బిజెపి కార్యక్రమంలో పాల్గొని తిరిగి హైదరాబాద్ వెళుతున్న ఆ పార్టీ రాష్ట్ర రథసారధి, ఎంపి బండి సంజయ్‌ను ఘనంగా సన్మానించారు. బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ రాజేశ్వరి మాణిక్‌రావు తన నివాసానికి బండి సంజయ్‌ను ఆహ్వానించి శాలువాతో సత్కరించి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అందరివాడు మహాత్మా విశ్వ గురు బసవేశ్వర విగ్రహాన్ని బండి సంజయ్‌కు బహుకరించారు. సంగారెడ్డి జిల్లాలో బిజెపి స్థితిగతులపై కౌన్సిలర్‌తో ఆరా తీసినట్లు తెలుస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు బిజెపి ఆదరించనున్నారని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి స్థల పరిశీలన



ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, మార్చి 26, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ సన్నిదిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల వ్యయంతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజులు తెలిపారు. ఈ నెల 27న భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ బాలాగౌడ్, సంఘం బాధ్యులు సాయిబాబా, అల్లుడు కృష్ణ, బోయిని కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ గెలుపునకే ఆత్మీయ సమ్మేళనాలు

**-జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ వెంకట్‌రామ్‌రెడ్డి**

**జహీరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** రానున్న శాసన సభ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) విజయం సాధించడానికే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు గ్రామాల వారిగా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ జిల్లా ఇంచార్జి ఎమ్మెల్సీ వెంకట్‌రామిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెంకట్‌రామిరెడ్డి జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావుతో కలిసి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాగానే రైతు బంధు పథకానిన అమలు చేయనున్నారన్నారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశాల మేరకు త్వరలోనే ఆత్మీయ సమ్మేళన తేదీలను ఖరారు చేస్తారన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ ఎం శివకుమార్, మైనార్టీ కార్పోరేషన్ సభ్యులు మహ్మద్ తన్వీర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మంకాల్ సుభాష్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు యాదవ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్‌రామిరెడ్డి, ఎమ్మెల్యే మాణిక్‌రావు

# రాహుల్‌పై అనర్హత వేటు.. మోడీ నియంతృత్వానికి పరాకాష్ట

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎంపీగా అనర్హత వేటు వేయడం ప్రధాని మోడీ దురహ కారం, నియంతృత్వానికి పరాకాష్ట అని మెదక్ పీసీసీ ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ అన్నారు. రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆదివారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన నిరసన దీక్షకు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పీసీసీ ప్రతినిధులు మ్యాడం బాలకృష్ణ, చౌదరి సుప్రభాతరావు ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్రకు మంచి స్పందన రావడంతో కేంద్ర ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదన్నారు. రూ. లక్షల కోట్ల ప్రజా ధనాన్ని అదానీ సంస్థలకు మోడీ ఎలా దోచి పెట్టారో రాహుల్‌గాంధీ ప్రజలకు వివరించారన్నారు. దీనిపై ప్రశ్నించినందుకే కేంద్ర పాలకులు ఆయనపై పగపట్టి లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయించారన్నారు. రాహుల్ గాంధీని కాపాడుకునేందుకు ప్రతి కాంగ్రెస్ నేత నడుం బిగించాలన్నారు.

**పిసిసి ప్రతినిధులు మ్యాడం బాలకృష్ణ, చౌదరి సుప్రభాతరావు**



నిరసన దీక్షకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

మోడీ, కేసీ ఆర్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నార న్నారు. వారి నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలన్నారు. తరలి వెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, హఫీజ్ మొల్సాబ్, మెదక్ మండల అధ్యక్షులు కె. శంకర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీ సీలు శివకుమార్, ప్రసాద్‌గౌడ్, రామాయంపేట ఎంపీటీసీ నాగులు, రామాయంపేట పట్టణ కార్య దర్శి అల్లాడి వెంకటేష్, రామాయంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్. వెంకన్న, రవినాయక్, రవిచంద్ నాయక్, నర్సింలు నాయక్, రమేష్, రామచంద్రం, నరేష్, గుండు శ్రీను, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ సల్మాన్, నవీన్ చౌదరి, మనికంఠ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇంచార్జి ఎమ్మెల్సీ వెంకట్‌రామిరెడ్డి

## కెసిఆర్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

**-నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ వెంకట్‌రామిరెడ్డి**

**సదాశివపేట, మార్చి 26, ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు భారతదేశానికే ఆదర్శంగా ఉన్నాయని నియోజకవర్గ ఇంచార్జి ఎమ్మెల్యే వెంకట్‌రామిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ ఛైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షులు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సారధ్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్సీ వెంకట్‌రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చింత ప్రభాకర్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించామని, ప్రజలకు సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణలోని ప్రతి వ్యక్తి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందుకున్నవారే అన్నారు. తెలంగాణ తరహాగా భారత దేశ ప్రజలకు సైతం సంక్షేమ పథకాలను అందించేందుకే బిఆర్ఎస్ పార్టీని ప్రారంభించారని, అధికారంలోకి రాగానే తెలంగాణలోఅమలు చేస్తున్న పథకాలు భారత దేశంలో సైతం అమలు చేస్తామన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి చింత ప్రభాకర్ ఘనంగా విజయం సాధించేలా ప్రతి కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ మల్కాపురం శివకుమార్, వైస్ ఛైర్మన్ పట్నం మాణిక్యం, సిసిడి ఛైర్మన్ బుచ్చిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు హకీం, నాయకులు, ప్రజాప్రతినిధులు ఆత్మకూరు నాగేష్, ఎంపిపి తోట యాదమ్మ, మండల ప్రధాన కార్యదర్శి ఆరిఫోద్దిన్, నాయకులు సత్యనారాయణ, అల్లం లలిత, లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్, రాజు, శ్రీనివాస్, నాగేష్, పెద్ద గొల్ల శ్రీహరి, ఏసు తదతరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

**జహీరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** మండలంలోని హోతి(బి) గ్రామంలో మార్చి 20వ తారీఖున ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ యూనిట్-2 శిబిరం ఆదివారంతో ముగిసినట్లు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జాతీయసేవా పథకం ఛైర్మన్ డాక్టర్ అస్లాం ఫారుఖి తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గ్రామంలో పారిశుద్య పనులు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారన్నారు. గ్రామంలో నిరక్షరాస్యత, నిరుద్యోగులపై సర్వే నిర్వహించారన్నారు. గ్రామంలో శిబిరం ఏర్పాటు చేయడం పట్ల గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేంగా అభినందించారన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ మహమ్మద్ పర్వేజ్, ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 కో-ఆర్డినేటర్లు రాములు, డాక్టర్ ఆయేషా బేగం, తెలుగు అద్యాపకులు శంకుతల, మైనార్టీ గురుకుల అల్గోల్ కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ జమీల్, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం

**-ఆలయం ఎదుట బోనం నైవేద్యాలు**

**కౌడిపల్లి, మార్చి 26, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో అమ్మవారి ఆలయాన్ని ఉదయంనుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మెన్ తాళ్ల గోపాల్‌రెడ్డి, అర్చకులు శ్రీనల్లపోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి, పూజలు నిర వ్వహించి మొక్కులను తీర్చుకున్నారు. కాగా భక్తులకు ఎలాంటి ఆసౌర్యాలు కలగకుండ ఈఓ సిబ్బందితో మౌలిక వసతులు కల్పించారు. ఈ కార యక్రమంలో తునికి గ్రామ ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆలయ జూనియర్ ఆసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, గ్రామ పెద్దలు బండి సాయాగౌడు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.



బోనాలు తీసుకెళుతున్న మహిళలు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న టీజేఎస్ కన్వీనర్ ఆశప్ప3

## దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలి

**-టిజెఎస్ కన్వీనర్ మొగుడంపల్లి ఆశప్ప**

**జహీరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలని టీజేఎస్ కన్వీనర్ మొగుడంపల్లి ఆశప్ప డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా పంటలకు నష్టం ఏర్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకన్న పాపన పోలేదని, రైతులను ఆదుకోవడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. ఈ మారైన రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి కల్వంకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సూచించారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు రాథోడ్, నాయకులు అంబులాల్ రాథోడ్, ప్రేమ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం అమానుషం

**టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి**



ప్రధాని మోడీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, మార్చి 26, ప్రభాతవార్త:** జాతీయ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ప్లారమెంట్‌లో అనర్హత వేటువేయడం, సభ్యత్వాన్ని రద్దు చేయడం అమానుషమని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, రవిందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుల మానవహారంగా ఏర్పడి బిజెపి డౌన్‌డౌన్, నరేంద్రమోడి డౌన్ డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో గంట పాటు ట్రాఫిక్ స్తంబించిపోయింది. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ పాదయాత్రకు మంచి స్పందనరావడంతో జీర్ణించుకోలేని బిజెపి ఓటమి భయంతోనేపార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేసిందన్నారు. ఓట్లరాజకీయం చేస్తూ బిజెపి ప్రభుత్వం మతాల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాహల్‌గాంధీ పార్టమెంట్ సభ్యత్వాన్ని పునరుద్దరించాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేషం, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గుప్త, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రిజ్వాన్, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, శ్రీశైలంయాదవ్, సురేశ్‌నాయక్, మండల ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు అశోక్‌గౌడ్,మల్లేష్‌యాదవ్, మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, రశీద్, కౌడిపల్లి పాషాబాయ్, ఇతర మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇతర మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగవద్గీత వార్షికోత్సవం

**రామాయంపేట, మార్చి 26, ప్రభాతవార్త :**

రామాయంపేటలో ఘనంగా భగవద్గీత వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తనలు, అనంతరం 18 అధ్యాయంల పారాయణం గావించారు. అనంతరం డి.కుమార శర్మ, బల్ల రాజయ్య ప్రవచనాలను భక్తులు శ్రద్ధగా విన్నారు. అనంతరం గురువులను భగవద్గీత సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు పారాయణాలు జరుగుతాయని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్రమౌళి, రామలింగం, గంగం అంజయ్య, గుండు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వనదుర్గా భవాని మాత సన్నిధిలో భక్తుల సందడి

**పాపన్నపేట, మార్చి 26, ప్రభాతవార్త:**

ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పిల్లాపాపలతో ఆలయానికి చేరుకున్నారు. మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తల నీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి బోనాలతో వెళ్లి అమ్మవారికి సమర్పించుకున్నారు. కుంకుమార్చన, ఒడిబియ్యం నింపడంలాంటి పూజ కార్యక్రమాలు ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటి ఛైర్మన్ బాలాగౌడ్, మండలి సభ్యులు మనోహర్, ఇఓ సార శ్రీనివాస్ సిబ్బందితో కలసి తగు చర్యలు తీసుకున్నారు. భక్తులతో ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.





వనదుర్గా భవాని మాతకు పూజలు చేస్తున్న పూజారి, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

## అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు : ఎమ్మెల్యే

**సిర్గాపూర్, మార్చి 26 ప్రభాతవార్త:** అభివృద్ధికి ఆకర్షితులై పలు పార్టీల నుంచి బిఆర్ఎస్‌లో చేరుతున్నారని ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిర్గాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షులు సంజీవరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో బాలయ్య, మోహన్, సాయిలు, రాములు, రవితోపాటు ఐదు కుటుంబాల వారు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు యాదవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు భూమయ్య, పార్టీ నాయకులు లాలయ్య, వార్డు మెంబర్లు వీరయ్య, కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరిన వారు బాలయ్య, మోహన్, ఉన్నారు.

## శాంతినికేతన్‌లో ఘనంగా రజతోత్సవ వేడుకలు



విద్యాలయ కరస్పాండెంట్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

**సదాశివపేట, మార్చి 26, ప్రభాతవార్త:** పట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయంలో రజతోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ పిల్లోడి జయమ్మ, వైస్ ఛైర్మన్ చింత గోపాల్, కౌన్సిలర్ మాణిక్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 1998లో 49 మంది విద్యార్థులతో ప్రారంభమైన శాంతినికేతన్ విద్యాలయం దినదినాభివృద్ధి చెందుతూ ఉన్నత విద్యను అందుస్తూ రాణిస్తోందని ముఖ్య అతిథులు కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాలిపటేల్ ప్రభు, అరవిందశ్రీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రాములు, శ్రీనివాస్, నరేష్, శేఖర్, పాఠశాల వ్యవస్థాపకులు అరిగే చంద్రమౌళి, గాండ్ల శశికళ, గాండ్ల సుధాకర్, విద్యార్థులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 26ప్రభాతవార్త:** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా 3వ,మహసభ ఆదివారం సంగారెడ్డిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడతూ కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని అన్నారు.కార్పోరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని, ప్రజాస్వామ్య బద్దంగా సాధించుకున్న హక్కులు అమలుకు నోచుకోలేకపోతున్నాయని అన్నారు. గౌరవ వేతనంపేరుమీద శ్రమదోపిడి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్,మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌పావని,సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దిన్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సమావేశం ప్రాంగణంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈసమావేశంలో జిల్లా నూతన కమీటిని ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం**



క్రీడకారులతో డిసిసిబి ఉపాధ్యాక్షులు

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 26 ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని,క్రీడకారులు క్రీడస్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డిసిసిబి) ఉమ్మడి మెదక్‌జిల్లా ఉపాధ్యాక్షులు పట్నం మాణిఖ్యం అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంస్థాయి ఒకరోజు వాలిబాల్ టోర్నమెంట్‌ను సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో పట్నం మాణిఖ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సవేశంలో మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ ఆలవడుతుందని.మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈటోర్నమెంట్‌లో 24వాలిబాల్ జట్లు పాల్గొన్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియోషన్ అధ్యక్షులు ఐసి మోహన్, వైఎస్ ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి,బిసి సంఘం జాతీయ ఉపాధ్యాక్షులు బీరయ్యయాదవ్,బిఆర్ఎస్ నాయకులు ప్రేమానందరం పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

**సదాశివపేట, మార్చి 26, ప్రభాతవార్త:** మండలంలోని వెంకటాపూర్‌లో ఆదివారం వన్ డే క్రికెట్ టౌర్నమెంట్‌ను నిర్వహించారు. క్రికెట్ టోర్నీని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి క్రీడాకారులు, యువకులు పెద్ద సంఖ్యలో చేరుకుని క్రికెట్‌ను ఆసక్తిగా కేరింతలు వేస్తూ తిలకించారు. టోర్ని విజేత జట్టుకు 5వేల నగదు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు 3వేల రూపాయల నగదు బహుమతిని, కప్పును ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, గ్రామ యువకులు నరేశ్ గౌడ్‌లు అందచేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



క్రికెట్ టోర్ని విజేత జట్టుకు బహుమతి అందచేస్తున్న దృశ్యం